ప్రారంభించకపోతే ఏం?" అన్నది వెంకటేశ్వర్లుతో తల్లి.

"పెళ్లి అవుతుందని ఆశ పుట్టిందేమో!" అన్నాడు వెంకటేశ్వర్లు.

"కొన్నాళ్లు కాపరం చేసి—!"

"ఏమిటమ్మా? బడితెలల్లే ముప్ఫైఏళ్లు వచ్చిన వాళ్లకు మళ్లీ కావటంలా?" అన్నాడతను నిష్ఠురంగా.

ఇంతకూ తల్లికొడుకుల కిద్దరికీ తెలియలేదు, భ్రమరపరివర్తనకు తమరే కారకు లని!

౧౨

వెంకటేశ్వర్లు ఎప్రెంటిస్ చెయ్యటంకూడా పూర్తి చేశాడు. కోర్టు తెరవగానే ప్రాక్టీసుకూడా ప్రారంభించనున్నాడు. అతని వివాహంకూడా స్థిరమయింది. ఏటి అవతలనించి వచ్చింది సంబంధం. వాళ్లు కొద్దిలో జమీందార్లు. రెండు మూడు లంకలుకూడా ఉన్నయి.

వివాహానికి అంతా సిద్ధమయేవరకూ భ్రమరకు వెంకటేశ్వర్లుపెళ్లినిగురించి తెలియదు. ఆసమయాన ఆమె పినతల్లిగారి ఊరు వెళ్లిఉంది.

తండ్రిరాసిన ఉత్తరంలో ఈవార్త చదవగానే "నేను వెళ్లిపోతాను, పిన్నీ!" అంటూ ప్రారంభించింది భ్రమర. కూతురి ఆదుర్దా పినతల్లికి అర్థం కాలేదు. ఇంకా ఒకనెల రోజులైనా పిల్ల తనదగ్గిర ఉంటుం దను కుంటున్న దావిడ.

భ్రమర పినతల్లిప్రార్థన వినిపించుకోకుండా ఇంటికి బయలుదేరింది. బండి ఆగగానే ఆమె తన ఇంట్లోకి పోవటానికి బదులు వెంకటేశ్వర్లుగారింట్లోకి వెళ్లింది. ఆమె పెట్టె తీసుకుని బండివాడు కూడా ఆ ఇంట్లోకే వచ్చాడు.

వెంకటేశ్వర్లు వరండాలోనే నిలబడి ఉన్నాడు. అతను భ్రమరవంక ఆశ్చర్యంతో చూచాడు, ఆమెను చూసి చాలా ఏళ్లయింది.

"వెంకటేశ్వర్లూ!"

అత నిప్పుడు గుర్తుపట్టి, "భ్రమరా!" అన్నాడు. మెడమీదిదాకా పెరిగిన ఆమె జుట్టూ, కొద్దిగా చిక్కిన శరీరమూ చూస్తే వెంకటేశ్వర్లుకు "ఉచ్ఛిష్టం" అనేమాట స్ఫురించలేదు. అతని పెదిమలు కొద్దిగా కదిలినై. "నాభార్య!" అనుకున్నా డతను.

"నీపెళ్లి అవుతున్నదని విని వచ్చాను. వెంకటేశ్వర్లూ! నా కెంతో సంతోషంగా ఉంది. నీ పెళ్లికి ఉండటానికి వీలవుతుందో కాదో ఇప్పుడే చూసి పోదామని వచ్చాను."

భ్రమర నవ్వు సంతోషమల్లే కనిపించలేదు వెంకటేశ్వర్లుకి. ఆమె తూలి అక్కడే పడిపోతుందేమో నని అతనికి ఒకక్షణంలో అనుమానంకూడా కలిగింది. కాని ఆమె అతనితో ఇంకేమీ అనకుండా వెనక్కు తిరిగింది.

"మనం ఇక్కడ ఉండటం లేదు. ఆ ఎదుటింటికి వెళ్లిపోతున్నాం, ఆపెట్టె తీసుకునిరా!" అంటూ భ్రమర గబగబా వెళ్లిపోయింది. దించిన పెట్టెను మళ్లీ ఎత్తుకుని బండివాడు ఆమె ననుసరించాడు.

విగ్రహంమాదిరిగా వెంకటేశ్వర్లు అట్లాగే నిలబడి ఉన్నాడు.

౧౩

"నాన్నా, నేను జుట్టు తీయించుకుంటాను. మంగలవాణ్ణి పిలిపించు!" అన్నది భ్రమర.

ఆమె తల్లి అందుకుని, "చాల్లే, నీకేమైనా మతి చెడుతున్నదా ఏమిటి?" అని కసిరింది.

౧౪

భ్రమర కళ్లఎదటినించి తొలిగిపోయినా వెంకటేశ్వర్లు మనసులోనించి తొలిగిపోలేదు. ఆమె జీవితంలో ఈమధ్య గడిచిన రెండు మూడేళ్ల కాలాన్ని భగవంతుడు రబ్బరుతో చెరిపినట్టయింది. భ్రమర చిన్ననాటినించీ ఈనాటివరకూ తనదే ననిపించింది అతనికి. భ్రమర కాకుండా మరొకరిని ప్రేమించటం, మరొకరిని ముట్టుకోటం, ముద్దుపెట్టుకోవటం అసంభవం, తనకు భ్రమరే కావాలి!

